క్లుప్తంగా

రేపు ఓపెన్ ఫోరం

నిడమనూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రమోద్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి హామీ పనులపై 13వ విడత సోషల్ ఆడిట్ జరుగుతుందన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీ ఎన్నిక పట్ల హర్షం

అడవిదేవులపల్లి: పీఆర్‌టీయూ రాష్ట అధ్యక్ష, కార్యదర్శులుగా ముదిరేసి చెన్నయ్య, సుంకరి భిక్షంగౌడ్ నియమించడం పట్ల అడవిదేవులపల్లి మండల పీఆర్‌టీయూ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో పలువురు పీఆర్‌టీయూ నాయకులు మాట్లాడుతూ.. చెన్నయ్య, భిక్షంగౌడ్ నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, కాటేపల్లి జనార్దన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకట్రామ్‌నాయక్, మహ్మద్, రమేష్, సైదులు, పవన్‌కుమార్, సైదులు, కేదారేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి షష్టి మహోత్సవం



సుబ్రహ్మణ్యస్వామి షష్టి మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలోని శ్రీవల్లి, దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడింది. సుబ్రహ్మణ్యస్వామి షష్టి మహోత్సవంలో భాగంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు వెల్లటూరి రాంమోహన్, వేద పండితులు సోమరాజుపల్లి ఫణికుమారశర్మ, పృథ్వీశర్మ వేద మంత్రోచ్చరణల మధ్య స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఏచూరి నాగేశ్వర్‌రావు, ఆంజనేయులు, సతీష్, ఏచూరి సతీష్ తదితరులున్నారు.

సైదులు మృతి బీజేపీకి తీరనిలోటు

డిండి: మండల పరిధిలోని కందుకూర్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త కుంభం సైదులు మృతి పార్టీకి తీరనిలోటని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలూనాయక్ అన్నారు. సోమవారం కందుకూర్‌లో సైదులు భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఏటి.కృష్ణ, మండలాధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టిన మాజీ జెడ్పీటీసీ



రోడ్డుపై గుంతలను మట్టితో పూడ్చివేయిస్తున్న నాయకులు

వేములపల్లి: ఎస్ఎస్పీ కాల్వ వెంబడి వేములపల్లి మండల కేంద్రం నుంచి తిమ్మారెడ్డిగూడేనికి వెళ్లే రోడ్డుకు సోమవారం మాజీ జెడ్పీటీసీ ఇరుగుదిండ్ల పద్మాగోవింద్ తన సొంత ఖర్చులతో మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయని, మరమ్మతులు చేపట్టాలని గతంలో ప్రజాప్రతినిధులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ప్రజల ఇబ్బందులను గుర్తించి తన సొంత ఖర్చులతో మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు.

దళితులకు మంత్రి పదవులు ఇవ్వడం హర్షణీయం



మాట్లాడుతున్న పోలే రవి

హాలియా: నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంలో దళితులైన మల్లు భట్టి విక్రమార్కను డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రిగా, దామోదర్ రాజనర్సింహను ఆరోగ్యశాఖ మంత్రిగా నియమించడం హర్షణీయమని తెలంగాణ దళిత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పోలే రవి, నాగార్జునసాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు లింగాల ప్రభాకర్ అన్నారు. సోమవారం హాలియాలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంద తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

అంతంతమాత్రంగానే వైద్య సేవలు

- డిప్యుటేషన్‌పై వెళ్లిన గుర్రంపోడు పీహెచ్‌సీ సిబ్బంది
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

గుర్రంపోడు: గుర్రంపోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది లేక వైద్య సేవలు సరిగ్గా అందడం లేదు. కొందరు డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాల్లో పనిచేస్తుండగా.. మరికొందరు బదిలీపై వెళ్లారు. 24 గంటల పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యాధికారులు సేవలు అందించాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పనిచేసే సీహెచ్‌ఓ వెంకట్‌రెడ్డి గత ఐదేళ్లుగా డిప్యుటేషన్‌పై రంగారెడ్డి జిల్లా పరిధిలోని అబ్దులాపూర్‌మెట్‌లో, సీహెచ్ఎస్ శారదాకుమారి మిర్యాలగూడలో, సూపర్‌వైజర్ ఉపేందర్ నల్లగొండలోని మాన్యంచెల్కలో, ఎంఎల్‌టీ సుజీత్ నల్లగొండలోని టీ-హబ్‌లో, అటెండర్ లక్ష్మీకాంత్ నల్లగొండలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పనిచేస్తున్నారు. ఇటీవల విధుల్లో చేరిన మరో వైద్యాధికారి డాక్టర్ జమీర్ మునుగోడుకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. సిబ్బంది లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



గుర్రంపోడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఉద్యోగులపై పనిభారం

పీహెచ్ఎస్‌లో పలువురు డిప్యుటేషన్‌పై వెళ్లడంతో ఉన్న ఉద్యోగులపై పనిభారం పెరిగింది. దీంతో ఇక్కడ విధులు నిర్వహించేందుకు వేరే చోటు నుంచి బదిలీపై ఉద్యోగులు రావడానికి వెనకాడుతున్నారు. ఇటీవల నల్లగొండ నుంచి డిప్యుటేషన్‌పై వెళ్లిన స్టాఫ్ నర్స్ మళ్లీ రావడంతో ఎట్టకేలకు ఆరోగ్య కేంద్రంలో రాత్రివేళ రోగులకు సేవలు అందుతున్నాయి. డిప్యుటేషన్లపై పలుమార్లు మండల సభలో ప్రజాప్రతినిధులు ప్రశ్నించడంతో డిప్యుటేషన్లు రద్దు చేయాలని తీర్మానాలు చేసి ఉన్నతాధికారులకు పంపించారు. ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు డిప్యుటేషన్ల విషయమై పలుమార్లు అప్పటి స్థానిక ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయింది. సిబ్బంది కొరత విషయాన్ని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ప్రజాప్రతినిధులు అంటున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత ఉన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. డిప్యుటేషన్లతో సిబ్బంది కొరత మరింత సమస్యగా మారింది. కాంట్రాక్టు సిబ్బందితో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. రేషనలైజేషన్ జరుగుతుందని తెలుస్తున్నందున సిబ్బంది కొరత త్వరలోనే తీరే అవకాశం ఉంది.

– భవానీ చక్రవర్తి, పీహెచ్‌సీ వైద్యాధికారి

ఓటరు నమోదుపై బీఎల్‌ఓలకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్ కోటయ్య

వేములపల్లి: మండల పరిధిలో ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, బీఎల్‌ఓ యాప్ వంటి విషయాలపై సోమవారం వేములపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఏఈఆర్‌ఓ శ్రీనివాస్‌శర్మ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. ఓటరు నమోదుకై స్పెషల్ సమ్మరి రివిజన్-2ను ఏర్పాటు చేసి బీఎల్‌ఓలకు మాస్టర్ ట్రైనర్లచే శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. బీఎల్‌ఓలు తమ ప్రాంతంలోని అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండి ఫారం-6, 7, 8పై అవగాహన ఏర్పరుచుకొని క్షేత్రస్థాయిలో ఎటువంటి ఇబ్బందులు, తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్ గుడిపాటి కోటయ్య, జనార్దన్, గోవర్ధన్, ఆర్‌ఐ మహేందర్‌రెడ్డి, సిబ్బంది నిర్మల, స్పందన, ఫాతిమా, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం బాలోజీ, వార్డెన్ బాలకృష్ణ

పెద్దవూర: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో నిర్వహించిన గిరిజన సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల జోనల్ లెవల్ పోటీల్లో పెద్దవూర గిరిజన ఆశ్రమ పాఠశాల, హాస్టల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపర్చి పలు క్రీడాంశాలలో బంగారు పతకాలను గెల్చుకున్నారు. ఈ నెల 14, 15, 16 తేదీలలో ఈ పోటీలు నిర్వహించారు. అథ్లెటిక్స్, 400 మీటర్ల రిలే పరుగు పందెంలో మునావత్ సాయి, జె. మణికుమార్, పాతులోతు పవన్, రమావత్ హరీష్, వాలీబాల్‌లో రవీందర్, సుమన్, బి. చిరంజీవి, బి. సతీష్, ఖోఖోలో జే. అంజిబాబు, ఆర్. హరీష్ గోల్డ్ మెడల్ సాధించారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధీరావత్ బాలోజీ, వసతిగృహ సంక్షేమ అధికారి కొల్లు బాలకృష్ణ, పీఈటీ రామయ్య, ఉపాధ్యాయులు కృష్ణ, సురేందర్, సైదులు, షబ్బీర్ తదితరులు అభినందించారు.

రావులపెంట జెడ్పీహెచ్ఎస్‌లో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

వేములపల్లి: మండలంలోని రావులపెంట జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎన్నికల పట్ల అవగాహన కల్పించేందుకు పాఠశాలలోని మొత్తం విద్యార్థులను పది వార్డులుగా విభజించి అందులో కొంతమందిని వార్డు మెంబర్లుగా నామినేషన్ వేయించి ప్రచారం చేయించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు వార్డు మెంబర్లుగా, సర్పంచ్‌గా ఎన్నుకోగా మరికొంతమంది విద్యార్థులు పోలింగ్, పోలీస్ అధికారులుగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఎన్నికలు, ప్రజాప్రతినిధుల విధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకన్న, అమరేందర్‌రెడ్డి, మాలి జగన్, శ్రీధర్, చైతన్యలత, విజయనిర్మల, వినోద్, కృష్ణయ్య పాల్గొన్నారు.

దళితుల భూములను లాక్కోవడం సరికాదు

కొండమల్లేపల్లి: మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో దళితులకు చెందాల్సిన భూమిని ఇతరులు రిజిస్ట్రేషన్ చేయించుకోవడం సరికాదని మాల మహానాడు నాయకులు అన్నారు. తమకు న్యాయం చేయాలని వారం రోజులుగా దళిత కుటుంబాలు చేపడుతున్న నిరసనకు దేవరకొండ డివిజన్ మాలమహానాడు నాయకులు సోమవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాలమహానాడు దేవరకొండ డివిజన్ అధ్యక్షుడు యేకుల సురేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి మేడ సైదులు, దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రమౌళి మాట్లాడుతూ.. గుమ్మడవెల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 78లో గల ఆరు ఎకరాల ఒక గుంట, సర్వే నంబర్ 79లోని 10 గుంటల భూమిని దళిత కుటుంబాలు సేద్యం చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఆ భూమిలోనే వారు నివాస గృహాలు కూడా కలిగి ఉన్నారని.. అయితే ఇటీవల కొందరు ఈ భూమిని లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని దళితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో భూతం సైదులు, జాగటి యాదగిరి, పెరుమాళ్ల వినోద్ పాల్గొన్నారు.

అవాస్తవాలు ప్రచురించడం తగదు

చింతపల్లి: మండలంలోని కుర్మేడు గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 247లో గల భూమి భూదాన్ బోర్డులో లేదని గ్రామానికి చెందిన జక్కుల వెంకటయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అది తాను కొనుగోలు చేసిన పట్టా భూమి అని, ఈ భూమిని హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులకు విక్రయించానని, కానీ ఓ దినపత్రికలో ఆ భూమి భూదాన్ భూమిలో ఉన్నట్లు అవాస్తవాలు ప్రచురించడం బాధించిందన్నారు. దీనికి సంబంధించిన పత్రాలు సైతం తన వద్ద ఉన్నాయని తెలిపారు. అలాగే సీసీఎల్ఏ హైదరాబాద్ వారు కూడా ఈ భూమి పట్టా భూమిగా పేర్కొన్నప్పటికీ తప్పుడు వార్తలు రాయడం సమంజసం కాదన్నారు. ఈ విషయమై తహసీల్దార్ కార్యాలయ అధికారులను వివరణ కోరగా.. సదరు భూమి భూదాన్ భూమి కాదని, పట్టా భూమి అని రికార్డులో ఉన్నట్లు తెలిపారు.

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని కలిసిన బీసీ సంఘం నేతలు



బుర్రా వెంకటేశంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ టౌన్: రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా నియమితులైన ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశంను సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్పొరేట్ విద్యా వ్యవస్థను నియంత్రించాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యా హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని బుర్రా వెంకటేశంను లింగంగౌడ్ కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వేములపల్లి: మూసీ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం కాల్వపల్లికి చెందిన మేడబోయిన సైదులు, కల్లెం ఎల్లయ్య, సాధినేటి అంజయ్య, దుండిగల వీరస్వామి తమ ట్రాక్టర్లలో రావులపెంట గ్రామ శివారులోని మూసీ వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ల యజమానులతో పాటు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

చిట్యాల: కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. సోమవారం చిట్యాలలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన పీఎం విశ్వకర్మ యోజన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను బీజేపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి విస్తృత ప్రచారం చేస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పదమూడు వేల కోట్ల రూపాయల నిధులతో ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ పథకాన్ని కుల, చేతి వృత్తిదారులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు నకిరేకంటి మొగులయ్య, మాస శ్రీనివాస్, కన్నెబోయిన మహాలింగం, పోట్లపల్లి నర్సింహగౌడ్, గుండాల నరేష్‌గౌడ్, గంజి గోవర్ధన్ పాల్గొన్నారు.

'విశ్వకర్మ యోజన'ను ఉపయోగించుకోవాలి

మర్రిగూడ: కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజనను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర మీడియా సెల్ కన్వీనర్ పిట్టల శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 10 లక్షలకు పైగా చేతివృత్తుల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. నియోజకవర్గానికి 1000 మందికి ఈ రుణాలను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జల్లాకుల సైదులు, రాజేందర్‌నాయక్, జిల్లా కిశోర్, గ్యార యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట డీఎస్పీ నాయకుల ధర్నా

నల్లగొండ టౌన్: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ నిబంధనలు సవరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో తెల్లరేషన్ కార్డు ఉన్న మహిళలకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులకు నెలకు రూ.3 వేల ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న, యల్లయ్య, శ్రీను, శంకరయ్య, జగన్, యాదగిరి, వినోద్, మహేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్



బాలునాయక్‌ను సన్మానిస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు

- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

దేవరకొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం దేవరకొండ ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న 6 గ్యారంటీలను ప్రజలకు చేరవేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన అభివృద్ధి పథకాల అమలు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. సమావేశంలో ఎంపీపీ నల్లదాసు జాన్‌యాదవ్, ఎంపీడీఓ శర్మ, తహసీల్దార్ సంతోష్‌కిరణ్, ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం దేవరకొండలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించిన పెన్షనర్స్ డే కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపనున్నట్లు తెలిపారు. అనంతరం సంఘం సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు దామోదర్‌రెడ్డి, చిలివేరు చంద్రశేఖర్, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, తాటిశెట్టి నర్సింహ, అంకం చంద్రమౌళి, పంగునూరి లింగయ్య తదితరులున్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని వినతి



డిపో మేనేజర్ పాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న దొండవారిగూడెం మాజీ సర్పంచ్ చంద్రకళ

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలంలోని దొండవారిగూడెం గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని సోమవారం ఆ గ్రామ మాజీ సర్పంచ్ చిరుమళ్ల చంద్రకళ ఆధ్వర్యంలో మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గతంలో దొండవారిగూడెం గ్రామం మీదుగా బస్సులు వచ్చేవని, కరోనా లాక్‌డౌన్ నుంచి పూర్తిగా బస్సు సర్వీసులు బంద్ కావడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దొండవారిగూడేనికి బస్సు సర్వీసు నడిపిస్తే జగ్గుతండా, వాల్యుతండా, జేత్రంతండా, ఆదర్శ నగర్, బీసీ కాలనీ, సోమ్యతండా తదితర గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. మిర్యాలగూడ డిపో నుంచి శెట్టిపాలెం మీదుగా ఒక బస్సు, తక్కెళ్లపహాడ్ మీదుగా మరో బస్సును ఉదయం, సాయంత్రం వేళ నడిపించాలని డీఎంను కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆయా గ్రామాలకు చెందిన యువకులు, విద్యార్థులు ఉన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి మండల పూజ



దేవరకొండ: ఆంజనేయస్వామికి అభిషేకం చేస్తున్న మాలధారులు



పెద్దవూర: బట్టుగూడెంలోని అయ్యప్ప దేవాలయంలో పడి ముట్టిస్తున్న భక్తులు

దేవరకొండ: పట్టణంలోని తుల్జమ్మ కుంట వద్ద గల శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో 25వ మండల పూజా మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దిమడుగు పీఠాధిపతి శ్రీకేతావత్ జైరాం గురుస్వామి, గిరి గురుస్వాముల ఆధ్వర్యంలో వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, బీఆర్ఎస్ నాయకులు బిల్యానాయక్, వడ్త్య రమేష్‌నాయక్ వేర్వేరుగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గెల్వయ్య, ఎస్ చారి, పులకరం గణేష్, కుమార్, నాగార్జున, మధు, ఆలయ కమిటీ సభ్యులు, ఆంజనేయస్వామి మాలధారులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజ..

పెద్దవూర: మండలంలోని బట్టుగూడెం గ్రామంలో గల ఇష్టకామేశ్వరస్వామి సహిత ఆంజనేయ, అయ్యప్ప దేవాలయంలో ఆదివారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, మాలికాపురత్తమ్మ, అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. బట్టుగూడెం గ్రామానికి చెందిన గురుస్వామి కూన్‌రెడ్డి విజయారెడ్డి-పారిజాత దంపతులు స్వామి వారికి పడి ముట్టించారు. అనంతరం మాలధారులు అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు గాలి సైదిరెడ్డి, కర్నాటి లక్ష్మారెడ్డి, సైదిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అంజిరెడ్డి, ఐ. వెంకటయ్య, అన్వేష్‌రెడ్డి, మనోజ్, శ్రీకాంత్‌రెడ్డి, వెంగల్‌రెడ్డి, చెన్నారెడ్డి, కోటేష్, బాలు, వీరు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎం లేక విద్యార్థినులకు ఇబ్బందులు

- దేవరకొండ కేజీబీవీలో 2021 నుంచి ఖాళీగా ఏఎన్ఎం పోస్టు
- అస్వస్థతకు గురైనప్పుడు విద్యార్థినులకు అందని తక్షణ సాయం



చందంపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం

చందంపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో ఏఎన్ఎం లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పాఠశాలలో ఉపాధ్యాయినులతో పాటు విద్యార్థినుల ఆరోగ్య సంరక్షణ కోసం ఒక ఏఎన్ఎం విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే 2021 సంవత్సరం నుంచి అక్కడ ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉంటూ వస్తోంది. దీంతో పలుమార్లు విద్యార్థినులు అస్వస్థతకు గురైతే చికిత్స నిమిత్తం 16 కి.మీ.దూరంలో ఉన్న దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి పరుగు పెట్టాల్సి వస్తోంది.

టీచర్లే మాత్రలు ఇస్తూ..

ఇదిలా ఉండగా చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు జలుబు, జ్వరం, కడుపు నొప్పికి టీచర్లు ఇచ్చే మాత్రలు వేసుకుంటున్నామని విద్యార్థినులు పేర్కొంటున్నారు. పలుమార్లు ఏఎన్ఎంను నియమించాలని ఉన్నతాధికారులకు కోరినా స్పందన లేకుండాపోయిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఇటీవల అస్వస్థతకు గురైన విద్యార్థినులు..

ఇటీవల ఈ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. అయితే స్థానికంగా చందంపేట పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది విధులు ముగిసిన తర్వాత అందుబాటులో ఉండకపోవడంతో వైద్యం కోసం దేవరకొండకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసర సమయాల్లో తమ పరిస్థితి ఏమిటని విద్యార్థినులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కేజీబీవీలో ఏఎన్ఎంను నియమించాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రాజెక్టులు పూర్తిచేసే బాధ్యత తీసుకుంటా

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- మంత్రి పదవి చేపట్టిన తర్వాత మొదటిసారిగా నల్లగొండకు..
- ఘన స్వాగతం పలికిన కార్యకర్తలు



నల్లగొండ పట్టణంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయించే బాధ్యత తీసుకుంటానని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టి మొదటిసారి నల్లగొండకు వచ్చిన సందర్భంగా సోమవారం కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. నల్లగొండ నియోజకవర్గాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తానన్నారు. కాంగ్రెస్ పాలనలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. ఇళ్లు లేని ప్రతి పేదవాడికి ఇళ్లు కట్టించే బాధ్యత తీసుకుంటామన్నారు. డిసెంబరు 28న కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు పథకాలను ప్రారంభిస్తామని మంత్రి చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10లక్షల వరకు ఉచితంగా వైద్యం అందించబోతున్నామన్నారు. కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తొలిసారి నల్లగొండకు రావడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీశ్రేణులు, మత పెద్దలు, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. మంత్రికి కలెక్టర్ కర్ణన్, అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ అపూర్వరావు, కౌన్సిలర్లు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.